"అవును సర్."

"ఐతే మనిషిలోని దుర్మార్గాన్ని కూడా దేవుడు సృష్టించినట్లేగా? అంటే దేవుడు దుర్మార్గుడన్నట్లేగా?" వెటకారంగా నవ్వుతూ ప్రశ్నించాడాయన

విద్యార్థులు ఆ లాజిక్‌కి సమాధానం చెప్పలేక తెల్లమొహాలేసారు. ఆయన క్లాస్‌లో దేవుడున్నాడని నమ్మే ఓ విద్యార్థి కూడా ఉన్నాడు. ప్రొఫెసర్ బోధనలని ఎప్పటికప్పుడు ఖండించే భక్తుడైన ఆ విద్యార్థి లేచి అడిగాడు.

"ప్రొఫెసర్‌గారూ, మిమ్మల్ని రెండు ప్రశ్నలు వేస్తాను. సరేనా?"

"సరే. అడుగు."

"చలి అనేది ఉందంటారా? లేదంటారా?"

" అదేం పిచ్చి ప్రశ్న? ఉంది. ఎందుకు లేదు?"

"నిజానికి చలి అనేదే లేదు సార్. వేడి లేని స్థితిని మనం చలిగా చెప్పుకుంటున్నాం. జీరో సెల్సియస్ అంటే, జీరో వేడిమి అని అర్థం. నా రెండో ప్రశ్నకి జవాబు చెప్పండి సార్. చీకటి అనేది వుందా?"

"ఎందుకు లేదు? ప్రతీ రాత్రి మనం దాన్ని చూస్తూనే వున్నాంగా?"

"చీకటనేదే లేదు సార్. వెలుతురు సోకని స్థితిని మనం చీకటిగా చెప్పుకుంటాం. అలాగే మానభంగాలు, హత్యలు, దొంగతనాలు లాంటి చెడ్డతనం కూడా లేనేలేదు సార్. వేడిమి లేకపోతే చలి, వెలుతురు లేకపోతే చీకటి ఎలా వుంటాయో అలాగే 'ప్రేమ' అనే దివ్యత్వం లేకపోవడాన్ని మనం దుర్మార్గంగా చెప్పుకుంటాం. దుర్మార్గం అనేది మీరు చెప్పినట్లు దేవుడి సృష్టి కాదు సార్. అది ఆయన ఉనికి సోకని స్థితి మాత్రమే." వివరించాడా విద్యార్థి.

## 6. సత్పురుషుడు

ఓ మతం పరంపరలోని ఓ మఠాచార్యుడు ఓ గ్రామంలో చాతుర్మాస దీక్ష నిర్వహిస్తున్నాడు. ఆయనని కొందరు గ్రామస్థులు కలిసి ఇలా అడిగారు.

"స్వామీ! చాలా కాలంగా మా అందరికీ అనుమానం వుంది. దయచేసి తీర్చండి. ఓ వ్యక్తి మామూలు మనిషా లేక సత్పురుషుడా అని గుర్తించగలగడం ఎలా?"

దీనికి ఆయన మర్నాడు జవాబు చెప్తానన్నాడు. మర్నాడు ఒకే రకంగా కనిపించే రెండు సీసాలని తెచ్చి, ఆయన గ్రామస్థుల ముందుంచాడు.

"ఈ రెండు సీసాలు ఒకే కర్మాగారంలో, ఒకే ముడి పదార్థాలతో తయారైనవి. ఈ రెంటిలో పట్టే పదార్థం కూడా సమానమే. ఐనా వీటి మధ్య ఎంతో తేడా ఉంది. అదేమిటో మీరు చెప్పగలరా?" అందరినీ అడిగాడు.

గ్రామస్థులు ఆసక్తిగా ఆ రెండు సీసాలని పరిశీలించి చూసారు. రెంటిలో వున్న నీరు ఒకే రంగులో వుండటంతో వాళ్ళకి ఎలాంటి తేడా కనపడలేదు.

వాళ్ళు చెప్పలేక పోవడంతో ఆ స్వామి వాటి మూతలు తీసి రెంటినీ తలకిందులు చేసాడు. వాటిలోని ద్రవాలు బయటికి కారాయి.

ఆయన ఓ గ్రామస్థుణ్ని పిలిచి ఆ ద్రవాలను రుచి చూసి ఎలా ఉన్నాయో చెప్పమన్నాడు. అతను ఒలికిన ఓ ద్రవంలో వేలుని ముంచి నాకి నవ్వుతూ చెప్పాడు.

"ఇది చక్కెర కలిపిన నీరు."

తర్వాత ఇంకో ద్రవాన్ని కూడా రుచి చూసి చెప్పాడు.

"ఇది ఉప్పు కలిపిన నీరు."

స్వామి అవునన్నట్లుగా తలూపి చెప్పాడు.

"ఇవి తలకిందులు కానంత వరకు వీటి మధ్య తేడా మీకెవరికీ తెలీలేదు. కాని ఓసారి తలకిందులయ్యాక తమలో ఏముంటే వాటినే ఇవి బయటికి వెడలగక్కాయి. ఇదేవిధంగా మనిషి ఏ విషయంలోనైనా తలకిందులైతే, అతని ప్రవర్తనలోంచి ఏం బయటికి వస్తుందో దాన్ని బట్టి,

అతను ఎలాంటివాడో గ్రహించ గలుగుతాం. ఎవరైనా మనల్ని కొట్టారనుకోండి. అప్పుడు చక్కెర నీరు అనే ఓర్పు బయటికి వచ్చి శాంతంగా ఉంటాడా? లేక ఉప్పు నీరు అనే కోపం, ప్రతీకారం బయటికి వచ్చి ఆ ప్రకారం ప్రవర్తిస్తాడా అన్నదాని మీద అతనెలాంటి వాడన్నది ఆధారపడి ఉంటుంది. తన కుటుంబ సభ్యులని ప్రేమించినట్లే, ప్రపంచంలోని అందరినీ కూడా తన ఆత్మీయుల్లా ప్రేమించ గలిగేవాడే మంచి మనిషి. ఎందుకంటే ప్రేమ మనం ఎలాంటి తప్పులు చేయకుండా అడ్డు పడటమే కాకుండా, ఎన్నో పాపాల నించి మనల్ని దూరంగా ఉంచుతుంది. ఓ మనిషి ఉత్తముడు అవడానికి అతను ప్రపంచంలోని అందరినీ సమానంగా ప్రేమించ గలుగుతున్నాడా లేదా అన్న ఒక్క విషయాన్ని బట్టి తెలుసుకోవచ్చు. ఇప్పుడర్థమైందా?''

"అయింది స్వామీ! తన, మన, ఇతర అనే భేదాలు లేనివాడే నిజమైన సత్పురుషుడు.'' చెప్పారా గ్రామస్తులు.

## 7. ఏడు వస్తువులు

ఓ గురుకులంలో సాధన చేస్తున్న శిష్యులు తమ గురువు జన్మదినాన్ని అట్టహాసంగా జరిపారు. బీదసాదలకి విశేషంగా అన్నదానం చేసారు. శిష్యులు ఆ సాయంత్రం, గురువు గారిని నాలుగు మంచి మాటలు చెప్పమని కోరారు.

ఆయన వాత్సల్యంగా చూసి అందరికీ తలో కవరు ఇచ్చి చెప్పాడు.

" పీటిలోని వస్తువులని మీరు రోజుకోసారైనా తీసి చూడండి. వాటి అర్థం తెలుసుకుంటే, మీరు వక్రమార్గంలోకి వెళ్ళకుండా అవి ఉపయోగపడతాయి''

శిష్యులు కవర్లలోని వస్తువులని చూసారు. అవన్నీ నిత్యజీవితంలో మనుషులంతా ఉపయోగించేవే. అంతా ఒకరి మొహాలు మరొకరు చూసుకున్నారు. ఆ వస్తువులనించి ఏం నేర్చుకోవాలో వాళ్ళకి అర్థం కాలేదు.